క్లుప్తంగా

పరిశోధనలపై దృష్టి పెడితే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు సిటీ: శాస్త్ర సాంకేతిక పరిశోధన, అభివృద్ధిలో భౌతిక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని, అందుచేత విద్యార్థినులు భౌతిక శాస్త్ర అధ్యయనం, పరిశోధనలపై దృష్టి పెడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజ రామన్న అధునాతన సాంకేతిక కేంద్రం శాస్త్రవేత్త డా.కమల్ అన్నారు. శుక్రవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భౌతిక శాస్త్రంలో ఉన్నత విద్య, పరిశోధన విద్య అనేవి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి. దేవికా రాణి, భౌతిక శాస్త్రం విభాగాధిపతి డా.ఎం శారత, డా.మహబూబ్ బాషా, వాసవి దేవి, డా. ఎం. పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీని సత్కరిస్తున్న బెరాకా చర్చి సభ్యులు

కర్నూలు(టౌన్) : గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. నగరంలోని స్థానిక బెరాకా ప్రెయర్ టవర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పాస్టర్లను ఆర్థికంగా ఆదుకున్న ఘనత వైఎస్ జగన్ సర్కారుకు దక్కుతుందన్నారు. అనంతరం బెరాకా ప్రెయర్ టవర్ చర్చి అధినేత మేకల జాన్ సెరుల్లా, జాన్ మోజెస్, మేరీ నిర్మల, ప్రభుదాస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ పరిపాలన అధికారి బందెల రాజు, విజయ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, ఇందిరా ప్రియదర్శిని, షైనీ సుహాసిని పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద కాపునాడు సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: కాపు నాడు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి ఆ సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాపునాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్జ రామకృష్ణ, గౌరవ సలహాదారులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని మన మాతృభాష వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజు, సుబ్రహ్మణ్యం, నగర బలిజ సంఘం నాయకులు ఈశ్వర్ కుమార్ రాయల్, ప్రేమ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పల్లంశెట్టి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ శ్రీను, డాక్టర్ ప్రతాప్, అనిమిరెడ్డి, శోభన్ బాబు, బీఎస్ రావు, జనసేన రాము, స్వామిరెడ్డి నగర్ శ్రీనివాసులు, మండ్లెం రవిరాయల్ పాల్గొన్నారు.

శ్రీవారికి సూర్య ప్రభ వాహన సేవ

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, శ్రీసూర్యనారాయణ స్వామి వార్లకు పంచామృత అభిషేకం, విశేష అర్చనలు, అరుణ హోమం నిర్వహించారు. రాత్రి శ్రీవారు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. సూర్య కల్చర్ అకాడమీ విద్యార్థులతో ప్రదర్శించ బడిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ప్రత్యేక శోభను తెచ్చాయి. కార్యక్రమంలో కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారులు హెచ్‌కే మనోహర్‌రావు, కార్యవర్గ సభ్యులు కేజీ ప్రభాకర్‌రావు, శివరాం ప్రసాద్, సోమనాథమూర్తి, దుర్గాప్రసాద్, కల్లె వేణుగోపాల్ శర్మ, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

కర్నూలు కల్చరల్: తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం పంచలింగాల చెక్ పోస్ట్ వద్ద సెబ్ అండ్ ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. కర్నూలు లక్ష్మీనగర్‌కు చెందిన నందిపాటి యాకుబ్ కుమారుడు నంది పాటి రవికుమార్ , కల్లూరు ముజఫర్ నగర్‌కు చెందిన పి.బి.గిడ్డయ్య కుమారుడు వెంకటరాముడు, కడపకు చెందిన ఎమ్. హరిట బుల్ రెడ్డి కుమారులు మేకల వినయ్‌కుమార్‌రెడ్డి, మేకల హరికాంత్‌రెడ్డి, ప్రసాద్ కుమారుడు బొంగురు సురేంద్ర అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను, కారును సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు.

ఓం ఆదిత్యాయ నమః

- భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు
- సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కాటసాని, తదితరులు





సూర్యదేవుడిని దర్శించుకుంటున్న మేయర్ బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి దంపతులు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు

కర్నూలు కల్చరల్: సూర్యనారాయణ స్వామి దేవాలయాల్లో రథ సప్తమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అభిషేకాలు, అరుణ హోమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. నగర శివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం భక్తజనంతో కిక్కిరిసింది. ఆలయ ఐదవ వార్షికోత్సవం , రథ సప్తమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ సూర్యనారాయణ స్వామి మూల విరాట్టుకు అవధూత దత్త పీఠాధిపతి సద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అభిషేకం నిర్వహించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మహా సౌరయాగం' (అరుణ యాగం) సూర్య నమస్కార కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, ఆదోని, పత్తికొండ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, కేడీసీసీబీ చైరపర్సన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎంపీ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, గౌరు చరితా రెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

- దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, సహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు యాదవేణి రామసుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో శుక్రవారం బి.తాండ్రపాడు క్రైడో పాఠశాల ప్రాంగణంలో రథసప్తమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు, విశ్రాంత వైద్యులు మోక్షేశ్వరుడు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సూర్యోపాసనతో సర్వశక్తిమంతులమవుదామన్నారు. ప్రతి పాఠశాలలో సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించాలన్నారు. ప్రతిరోజు సూర్యోపాసన, సూర్య నమస్కారాలతో విద్యార్థుల్లో తేజస్సు, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మానసిక శారీరక రుగ్మతల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యాలు అలరించాయి. వివేకానంద కేంద్ర యోగా మాస్టర్ అనంత అనిల్‌కుమార్ సూర్య నమస్కారాలు చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్య కార్తిక్, పాల్గొన్నారు.

- శ్రీ పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రథ సప్తమి వేడుకలు నిర్వహించారు. ఆదిత్య హృదయం పఠనం చేసి ప్రత్యక్ష దైవం సూర్య భగవానునికి పూజలు చేశారు. యోగా కేంద్రం సభ్యులు సూర్య నమస్కారాలు, యోగాసానాలు ప్రాణాయామం చేశారు. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య సందేశమిచ్చారు. కార్యక్రమంలో కేంద్రం కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు ఇల్లూరు రంగస్వామి, కేశవరావు, రామసుబ్బమ్మ సుచరిత పాల్గొన్నారు.

సూర్యభగవానునితో ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్):సూర్యభగవానుని వల్లే అందరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఉన్న సరస్వతి శిశుమందిర్ ఆవాస ఉన్నత పాఠశాలలో రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుని ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

నగరాభివృద్ధే ధ్యేయం

- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



11వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు (టౌన్) : నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక 11వ వార్డు ఖడక్‌పురలో రూ.18.60 లక్షలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే 10వ వార్డు పరిధిలోని గొలిగేరి, చాకలి గేరిలలో రూ.50 లక్షలతో, నాగలకట్ట, పింజరి వీధుల్లో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రతి వీధిలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో ప్రగతి పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నగరాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫరాజ్ ఖాన్, షేక్ యూనుస్ బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫైసల్, అఫ్రోజ్, ఫైరోజ్, షేక్ ఫైసల్, అబ్దుల్లా, జుబేర్, భారతి, నజీర్ అలీఖాన్, షబ్బీర్ ఖాన్, అలీ ఖాన్, రజాక్ ఖాన్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. సీఎం సహాయ నిధి నుంచి భాగ్యనగర్ వీధికి చెందిన వేమిరెడ్డి, హర్షిత కుటుంబానికి మంజూరైన రూ.5.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గుమ్మజ్ దర్గా ప్రాంతం పరిశీలన

నగరపాలక సంస్థ పరిధిలోని 10 వ వార్డులో ఉన్న గుమ్మజ్ దర్గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్‌బాషాతో కలిసి దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. దర్గా కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఎమ్మెల్యే నీటి సమస్య పరిష్కారానికి బోరు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కొండారెడ్డి బురుజు వద్ద ఎలా సుందరీకరించామో అలాగే గుమ్మజ్ దగ్గర కూడా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ వైఎస్ఆర్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 'సిద్ధం' సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్ జగన్‌ది అన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, సీనియర్ లీడర్ సీహెచ్ మద్దయ్య, పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య

కర్నూలు (టౌన్) : స్థానిక రాంబొట్ల దేవాలయంలో టీటీడీ నిధులు రూ.1.41 లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ కల్యాణ మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. అలాగే రూ. కోటితో ఆలయంలో ఐదు అంతస్తుల రాజగోపురం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాలకు అతిథులుగా కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, రాంబొట్ల దేవాలయ కమిటీ చైర్మన్ దీప్తి నగరూరు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ నిధులు వెచ్చించి అందరికీ ఉపయోగ పడే విధంగా కల్యాణ మండపం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరు దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, రాంబోట్ల దేవాలయ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, సిద్దయ్య, మద్దిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు వాసు, సుజాత, అర్షియా ఫర్వీన్, షేక్ యూనుస్, షాషావలి, పార్టీ నాయకులు శేషు యాదవ్ కృష్ణకాంత్ శర్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న డాక్టర్ శైలేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలో ఉన్న క్రైడో ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన నులిపురుగుల మాపప్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులతో కలిగే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడటం ద్వారా పొట్టలోని నులిపురుగులు నివారించడమే గాక రక్తహీనతను అధిగమించవచ్చని వారికి సూచించారు. పిల్లలు మట్టిలో ఆడుకుంటే నులిపురుగులు చేతుల్లో చేరతాయని, చేతులను శుభ్రం చేసుకోకపోతే పొట్టలోకి చేరి అభివృద్ధి చెందుతాయని అన్నారు. దీంతో బక్కచిక్కిపోతారని, రక్తహీనతతో బాధపడతారని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలు చప్పరించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ కౌసర్, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ యశోధ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక బడ్జెట్ సమావేశం

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు నగరపాలక సర్వసభ్య ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగరమేయర్ బీవై రామయ్య తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు, విద్యా నిధులకు సంబంధించి 2023-24 సంవత్సంలో సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024-25 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను ఆమోదించేందుకు సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరపాలక సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థలో కల్లూరు గ్రామ పంచాయతీ, మునగాలపాడు, స్టాంటన్ పురం, మామిదాల పాడు, లక్ష్మీపురం, పందిపాడు గ్రామ పంచాయతీలు విలీనం కావడంతో కర్నూలు నగర విస్తీర్ణం 117 చదరపు కిలో మీటర్ల పెరిగిందని తెలిపారు. ఆ మేరకు ఆప్కాస్ ద్వారా 665 ఔట్‌సోర్సింగ్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు, ఆరుగురు సెక్యూరిటీ గార్డులను తీసుకునే అంశంపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

కర్నూలు (సిటీ) : మహా శివరాత్రికి వెంకటాపురం, శ్రీశైలం, మహానంది పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా సంస్థ ఈడీ (కడప) జి.వెంకటేశ్వరరావు అధికారులకు ఆదేశించారు. బస్సుల ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లాలోని వివిధ బస్‌స్టేషన్ల మేనేజర్లతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులు సౌకర్యవంతంగా క్షేత్రాలకు వెళ్లేందుకు అవసరమైన మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా, వివిధ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

కర్నూలు (సెంట్రల్) : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులే కాక మైనర్ రూట్‌లలో కూడా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని వివిధ జిల్లాల ఎస్పీలను ఆదేశించారు. కాగా ఎన్నికల ప్రధానాధికారికి జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు డివిజన్ హెడ్ పోస్టాఫీసులో అసిస్టెంట్ పోస్టల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న చైతన్య మనోజ్ కుమార్ ఆలిండియా పోస్టల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 3వ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ ఉద్యోగిని పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్. విజయజ్యోతి హెడ్‌పోస్టాఫీసులో సన్మానించారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో తమ ఉద్యోగి 3వ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మోడల్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: హరి నామ సంకీర్తనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ కేంద్రం బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో శుక్రవారం హరినామ సంకీర్తన ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు భగవంతుడి నామ స్మరణతో సద్గుణాలు అలవడతాయన్నారు. అనంతరం భక్తులు హరినామ జపయజ్ఞం నిర్వహించారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు సిటీ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30 శాతం మంజూరు చేయాలని ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయ రాజు డిమాండ్ చేశారు. ఆ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు, కల్లూరు మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలని, కారుణ్య నియమాకాలు చేపట్టాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు టీవీ రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్ మాలిక్ బాషా, మహిళా విభాగం సభ్యులు జ్ఞాన శిరోమణి, తదితరులు పాల్గొన్నారు.

డిస్పాచ్ సెంటర్ల పరిశీలన



అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసే డిస్పాచ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి సిల్వర్ జూబ్లీ కాలేజీలో కోడుమూరు, అవుట్ డోర్ స్టేడియంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన డిస్పాచ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సృజన ఆయా సెంటర్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొదట దూరంగా ఉండే పోలింగ్ కేంద్రాలకు డిస్పాచ్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రి, సిబ్బంది తరలిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి డిస్పాచ్ సెంటర్లకు పోలింగ్ సామగ్రిని తీసుకురావడం కోసం జిల్లా ఎస్పీతో మాట్లాడి అవసరమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ ఆర్ఓ, కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కోడుమూరు ఆర్ఓ, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీఆర్వో కె.మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులకు 40 శాతం వేతన సవరణ ఇవ్వాలి



కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): జీవిత బీమా సంస్థ ఉద్యోగులకు 40 శాతం వేతన సవరణ కోరగా, 14 శాతం ఇస్తారనే సమాచారాన్ని ఎల్ఐసీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కర్నూలు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు మక్బూల్ అహమ్మద్, సునీల్‌కుమార్ అన్నారు. ఏఐఐఈఏ పిలుపుమేరకు ఇన్సూరెన్స్ ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి శుక్రవారం అఖిల భారత గ్రామీణ బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష పూరిత విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీపరం చేసేందుకు అడుగులు వేయడం బాధాకరమన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ ఉద్యోగుల నియామకాన్ని చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా బంద్ ప్రశాంతం

- కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపిన కార్మిక సంఘాలు
- జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలు



కార్బైడ్ ఫ్యాక్టరీ ఎదుట జాతీయరహదారి దిగ్బంధంలో మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ



జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న పీపీఎస్ఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలపై కార్మిక సంఘాలు తీవ్ర నిరసన తెలిపాయి. హిట్ అండ్ రన్ సెక్షన్ 106-1-2లను తొలగించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రవాణా బంద్ నిర్వహించాయి. కార్యక్రమంలో భాగంగా లాంగ్ లారీ ఓనర్ అసోసియేషన్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత-2023 చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రమాదాలకు కారణమయ్యే డ్రైవర్లకు పదేళ్ల జైలుతోపాటు రూ.10 లక్షల జరిమానా విధించడం సరికాదన్నారు. అలాగే డ్రైవర్ల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, రవాణా రంగానికి ఇబ్బందులు తెచ్చిపెట్టే జీఓలు 21,31లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాంగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మిన్నల్ల, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

పీపీఎస్ఎస్ ఆధ్వర్యంలో...

దేశంలోని కార్మిక, కర్షకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించారు. ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు సమీపంలో నిరసన వ్యక్తం చేయడంతో అరగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పీపీఎస్ఎస్ రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ అన్వర్‌బాషా, మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిస్సార్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. వెంటనే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు.